సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



నెలలోనే మద్యం నుంచి విముక్తి

మద్యానికి బానిసైన వారి జీవితాలను చక్క దిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న డీ అడిక్షన్ కేంద్రాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. 8లో ▸



ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కైకలూరు మండలం సింగాపురం వద్ద ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధురాలు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. 8లో ▸



భార్యపై కత్తితో దాడి

ఏలూరు జిల్లా ముందూరు గ్రామంలో భార్యపై అనుమానంతో ఓ భర్త కత్తితో దాడి చేయడంతో ఆమెకు తీవ్రగాయా లయ్యాయి. 8లో ▸

న్యూస్‌రీల్

మూడోసారి వైనాట్‌కు టైమ్స్ బిజినెస్ అవార్డు



నటి రకుల్‌ప్రీత్ సింగ్ నుంచి అవార్డు అందుకున్న వెంకట్రాయుడు దంపతులు

తణుకు: పట్టణానికి చెందిన వైనాట్ షాపింగ్ మాల్ అధినేత జుజ్జవరపు వెంకటరాయుడు ప్రముఖ నటి రకుల్‌ప్రీత్‌సింగ్ చేతుల మీదుగా టైమ్స్ బిజినెస్ అవార్డును బుధవారం అందుకున్నారు. ఎలక్ట్రానిక్స్, హోం అప్లయన్సెస్ విభాగంలో ఉత్పత్తులు, ఉత్తమ సర్వీసులు అందించినందుకు గాను విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకట్రాయుడు, శ్రీదేవి దంపతులు ఈ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఇప్పటివరకు మూడోసారి ఈ అవార్డును అందుకోవడం విశేషం. ఈ విజయంలో వినియోగదారులకు భాగస్వామ్యం ఉందని పేర్కొన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేఎస్ఎస్ సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన లోక్‌సభ సభ్యులు, శాసనసభ సభ్యులను స్థాయి సంఘాలకు ఎన్నిక కార్యక్రమం, జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తారని పేర్కొన్నారు.

1 నుంచి శ్రీవారి నిత్యకల్యాణ రుసుము పెంపు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యార్జిత కల్యాణం సేవా టికెట్ రుసుము సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పెరగనుంది. ప్రస్తుతం రూ.1,500లుగా ఉన్న ఈ టికెట్ ధర రూ.2 వేలకు పెంచుతున్నట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు గురువారం తెలిపారు. స్వామివారికి జరిగే నిత్య కల్యాణానికి ఎంతో విశిష్టత ఉంది. కోరిన కోర్కెలు తీరిన భక్తులు, అలాగే కోర్కెలు తీరాలని మొక్కుకున్న వారు ఈ సేవలో ఎక్కువగా పాల్గొంటారు. ప్రస్తుతం సాధారణ రోజుల్లో 70 నుంచి 100 మంది, ప్రతి శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో 230 నుంచి 250 మంది వరకు దంపతులు ఈ సేవలో పాల్గొంటున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా అంజయ్య

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కమిషనర్‌గా ఎం.అంజయ్యను నియమిస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను ఇక్కడకు బదిలీ చేశారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన కె.వెంకటేశ్వరరావు వారం క్రితమే బదిలీ కావడం తెలిసిందే. కొత్త కమిషనర్ శనివారం విధుల్లో చేరే అవకాశం ఉంది.

తెలుగు భాషను పరిరక్షించుకుందాం

భీమవరం(ప్రకాశం చౌక్): మాతృభాషతోనే మానవ మనుగడ సాధ్యమని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో తెలుగు అధికార భాషా దినోత్సవం, జాతీయ క్రీడల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి, మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జేసీ మాట్లాడుతూ గ్రాంథిక భాషకు పట్టం కడుతున్న రోజుల్లో వ్యవహారిక భాషను కాపాడటానికి గిడుగు వెంకట రామమూర్తి పోరాటం చేశారన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు చదువులో కూడా రాణించగలమన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ క్రీడా రంగంలో చేసిన విశేష కృషిని తెలిపారు. గతేడాదిలో వివిధ క్రీడాల్లో రాణించిన జట్లుకు ఎక్స్‌లెన్సీ అవార్డులను జేసీ అందజేశారు.

ఆర్‌బీఐ క్విజ్ పోటీల్లో పాల్గొనండి

ఆర్‌బీఐ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలను కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఆర్బీఐ ఆన్‌లైన్ క్విజ్ పోటీల పోస్టర్‌ను జేసీ ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు క్విజ్ పోటీలకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఒక కళాశాల నుండి ఎంతమంది విద్యార్థులైనా టీమ్‌గా ఏర్పడి దరఖాస్తు చేయవచ్చన్నారు. ఎల్‌డీఎం ఎ.నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను సెప్టెంబర్ 1వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితమని తెలిపారు.



వైద్యుల భద్రత కీలకం



వైద్యాధికారులు, వైద్యసిబ్బందికి మరింత భద్రత కల్పించేందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి. రోగాలను నయం చేసే వైద్యులు, వైద్య సిబ్బందికి అభద్రతా భావం ఉంటే అంకితభావంతో వైద్యసేవలు ఎలా చేయగలరు. వైద్యులపై దాడులు, దౌర్జన్యాలు చేయడం సరికాదు. ఈ విధానం మారాలి. వైద్యులతో పాటు మహిళా వైద్యులు, సిబ్బందికి పటిష్టమైన భద్రత కల్పించాలి.

– డాక్టర్ చైతన్య, మెడికల్ ఆఫీసర్, పోతునూరు పీహెచ్‌సీ

ట్రైనీ డాక్టర్‌పై అఘాయిత్యం దారుణం



ట్రైనీ డాక్టర్‌పై అఘాయిత్యం చేయడం దారుణం. లైగింక దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. ఇందుకోసం అవసరమైతే ప్రత్యేక చట్టాలు రూపొందించాలి. పని ప్రదేశంలో వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి. వైద్యులు పలుసార్లు 36 గంటలు పాటు విధులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల తీవ్రమైన పని ఒత్తిడిలో ఉంటున్నారు. వారికి సరైన విశ్రాంతి కల్పించాలి. పక్కా భద్రత నడుమ రెస్ట్ రూమ్స్ ఏర్పాటుచేయాలి.

– డాక్టర్ ప్రదీప్‌చంద్ర, చాటపర్రు పీహెచ్‌సీ వైద్యులు

ఇసుక రాదు.. పని దొరకదు

స్టాక్ పాయింట్లు ఖాళీ అవుతున్నాయి. ఇప్పటికే డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు అడుగంటగా, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని మూడు స్టాక్ పాయింట్ల వద్ద మరో రెండు వారాలకు సరిపడా నిల్వలు మాత్రమే ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో పర్యావరణ అనుమతులు రాక దాదాపు ఫిబ్రవరి నుంచే తవ్వకాలు నిలిచిపోగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ర్యాంపుల్లో మే నెల ముందే ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో ఇసుక కొరతతో నిర్మాణ రంగం కుదేలై కార్మికులకు ఉపాధి కరువైంది. దీంతో పనుల కోసం పొరుగు రాష్ట్రాలకు భవన నిర్మాణ కార్మికులు వలసలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

- తెరుచుకోని ర్యాంపులు.. ఖాళీ అవుతున్న స్టాక్ పాయింట్లు
- ఇసుక కొరతతో కుదేలవుతున్న భవన నిర్మాణ రంగం
- ఉపాధి కరువు.. పొరుగు రాష్ట్రాలకు కార్మికుల వలసలు
- జిల్లాలో లక్ష మందికి పైగా భవన నిర్మాణ కార్మికులు
- పనుల్లేక పూట గడవడం కష్టమవుతోందంటూ ఆవేదన

సాక్షి, భీమవరం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భవిష్యత్తు అవసరాల కోసం ముందు చూపుతో ర్యాంపుల సమీపంలో ఇసుక నిల్వకు చర్యలు తీసుకుంది. పశ్చిమగోదావరి జిల్లాకు సమీపంగా తూర్పుగోదావరి జిల్లా పెండ్యాల, తీపర్రు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెంలలో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసింది. అప్పట్లో ఈ స్టాక్ పాయింట్లను అవినీతి కొండలంటూ అసత్య ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారంలోకి రాగానే ఇసుక అక్రమ తరలింపునకు తెరలేపారు. కూటమి నాయకుల ఒత్తిళ్లతో అధికారులు పాత స్టాక్ రికార్డుల జోలికి వెళ్లకుండా ఉన్న స్టాక్‌లే లెక్కలు గట్టి ప్రకటించారు. పేరుకు ఉచితమే అయినా జట్టు రవాణా, కూలీలు, వెయిటింగ్ చార్జీలు తదితర రూపాల్లో గతంతో పోలిస్తే 20 టన్నుల లారీకి రూ.నాలుగు వేల నుంచి ఆరు వేలు వరకు వినియోగదారులపై అదనపు భారం పడుతోంది.



రావులపాలెంలో ఖాళీ అయిన స్టాక్ పాయింట్

కుదేలవుతున్న నిర్మాణ రంగం

ఇసుక కొరత నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం జిల్లాకు సమీపంగా పెండ్యాల, పందలపర్రు పాయింట్ల వద్ద మాత్రమే ఇసుక లభ్యత ఉండటంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి ఈ రెండు పాయింట్లపై ఒత్తిడి అధికంగా ఉంది. దీనికితోడు నాయకుల సిఫార్సులతో స్థానికంగా ఉన్న లారీల లోడింగ్‌కే ప్రాధాన్యమిస్తున్నారు. ఇతర జిల్లాల లారీలు లోడింగ్ కోసం రెండు మూడు రోజులు పైగా వేచి ఉండాల్సి వస్తుండటంతో కిరాయి పెరిగిపోతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 3 వేల టిప్పర్ లారీలు ఉన్నాయి. ప్రస్తుతం వంద వరకు లారీలకు మాత్రమే పనిదొరుకుతుండగా మిగిలినవి ఖాళీగా ఉంటున్నాయని యూనియన్ నాయకులు అంటున్నారు. అధిక ధర వెచ్చించి ఇసుక కొనుగోలు చేయలేక సామాన్య, మధ్యతరగతి వారు ఇళ్ల నిర్మాణానికి వెనుకడుగేస్తున్నారు. ఎక్కడిక్కడ నిర్మాణాలు నిలిచిపోయి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువవుతోంది. జిల్లాలో కార్మిక శాఖలో రిజిస్టర్ అయిన భవన నిర్మాణ కార్మికులు 42,759 మంది ఉండగా, నమోదు కాని కార్మికులు రెట్టింపు స్థాయిలో ఉంటారని అంచనా. రోజూ పనికి వెళితే రూ.800 నుంచి రూ.1,200 వరకు కూలీ వస్తుంది. ఇసుక దొరక్క కొద్ది నెలలుగా వారంలో పూర్తి స్థాయిలో పని దొరక్క కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క ప్రభుత్వ సంక్షేమ పథకాలు లేక ఇల్లు గడవడం కోసం అయినకాడికి అప్పులు చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. కొందరు పనుల కోసం తెలంగాణ, కర్ణాటక, ఒడిశా తదితర పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారంటున్నారు. ఇసుక సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదని వారు వాపోతున్నారు.

నిండుకుంటున్న నిల్వలు



ఇసుక లేక అర్థిలిలో ఆగిన భవన నిర్మాణం

జూలైలో అమ్మకాలు మొదలు పెట్టేనాటికి పందలపర్రు స్టాక్ పాయింట్ వద్ద 52,082 టన్నుల ఇసుక నిల్వలు ఉండగా, పెండ్యాలలో 1,46,249, ఉసులుమర్రులో 33,065, రావులపాడు–1లో 34,171, రావులపాడు–2లో 82,950, కొత్తపేట కేంద్రంలో 25,897 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. రావులపాలెం, కొత్తపేటలో ఇసుక నిల్వలు ఎప్పుడో అయిపోగా ఇటీవలే కపిలేశ్వరపురం, ఉలుసుమర్రులో స్టాక్ నిండుకుంది. ప్రస్తుతం పందలపర్రులో 18 వేలు, పెండ్యాలలో 70 వేల మెట్రిక్ టన్నులు, ఏలూరు జిల్లాలోని గుబ్బనూరులో కొంతమేర మాత్రమే ఉన్నాయి. వీటి వద్ద మరో రెండు వారాల్లో నిల్వలు అయిపోతాయని అంచనా.

ఇంటి నిర్మాణం నిలిచిపోయింది



ఇసుక దొరక్కపోవడంతో రెండు నెలలుగా ఇంటి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. గతంలో ఆరు యూనిట్ల లారీ ధర రూ.16 వేల వరకు ఉంటే ఇప్పుడు రూ.22 వేలకు పైగానే చెబుతున్నారు. అదీకూడా ఎప్పుడు వస్తుందో తెలీడం లేదు. ధర తగ్గాక చేయించుకుందామని ప్రస్తుతానికి పని నిలిపివేశాం.

– చవ్వాకుల రాజేష్, భవన యజమాని, మంచిలి

లారీలకు పని లేదు



ఉమ్మడి జిల్లాలో మూడు వేల వరకు టిప్పర్ లారీలు ఉన్నాయి. ఒక్కో లారీపై యజమాని, ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్లు కలిపి ఐదు కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారు. ఇసుక లేక వంద లారీలకు పూర్తిగా పనిదొరకడం లేదు. మిగిలినవి ఖాళీగా ఉండటంతో వాటిపై ఆధారపడిన వారు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– రావూరి రాజా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టిప్పర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు, పాలకొల్లు

పనులు ఉండటం లేదు



నా వద్ద వర్కర్స్‌తో కలిసి కాంట్రాక్టులు తీసుకుని ఇళ్ల నిర్మాణాలు చేస్తుంటాం. ఇసుక కొరత కారణంగా ధర ఎక్కువగా ఉందని చాలా మంది ఇళ్ల యజమానులు నిర్మాణ పనులను ఆపేస్తుడటంతో మాకు పనుల్లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. గత్యంతరం లేక కొంతమంది కార్మికులు వేరే పనుల్లోకి వెళ్లిపోతున్నారు.

– ఎస్‌కే సిద్ధిక్, తాపీమేస్త్రి, నరసాపురం

జ్వరంతో బాలిక మృతిపై మరోసారి విచారణ

- వైద్యం అందించడంలో లోపాలు లేవు : వైద్య బృందం
- వైద్యం వికటించడం వల్లే మృతి : బాలిక తల్లిదండ్రులు

ఆకివీడు: ఇటీవల జ్వరంతో బాలిక మృతి చెందిన ఘటనపై వైద్య బృందం గురువారం మరోసారి ఆకివీడు సీహెచ్‌సీలో విచారణ చేపట్టింది. స్థానిక సీహెచ్‌సీలో సంబంధిత వైద్యుల్ని, స్టాఫ్‌నర్సులను, మృతురాలి తల్లిదండ్రులు, బంధువుల్ని విచారణ చేశారు. ఈ సందర్భంగా మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు మాట్లాడుతూ జ్వరంతో వచ్చిన బాలికకు సరైన వైద్యం అందజేయలేదని, వైద్యం వికటించడం వల్లే బాలిక లహరి మృతి చెందిందని వాపోయారు. అనంతరం వైద్య బృందం ప్రతినిధులు ఓ.రవికుమార్, సాయి కిరణ్‌మై, శివరామకృష్ణంరాజు మాట్లాడుతూ బాలిక 102 డిగ్రీల జ్వరంతో రాగా మందులు ఇచ్చిన తరువాత జ్వరం తగ్గిందని, రాత్రికి మళ్లీ జ్వరం అధికం కావడం, వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడటంతో ఇంజెక్షన్లు చేశారని చెప్పారు. వాటిలో ఏ విధమైన లోపాలు లేవని బృందం ప్రతినిధి రవికుమార్ చెప్పారు. విచారణలో డీసీహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, స్థానిక ఇన్‌చార్జి సూపరింటెండెంట్ అజ్మీరా నజరిన్, వైద్యురాలు భువన, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.



ఆకివీడు సీహెచ్‌సీలో మృతురాలి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విచారణ వైద్య బృందం

సీపీఎం ధర్నా

బాలిక లహరి మృతి ఘటనపై సీపీఎం నాయకులు ఆకివీడు సీహెచ్‌సీ వద్ద గురువారం ధర్నా చేశారు. బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే లహరి మృతి చెందిందని ధ్వజమెత్తారు. దీనిపై కలెక్టర్ ఉన్నత స్థాయి కమిటీని వేసి విచారణ జరిపి, బాలిక కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు పెంకి అప్పారావు, బీ.వర్మ, డీ.రవితేజ, సందక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ విరివిగా రుణాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకర్లు విరివిగా రుణాలు అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన బ్యాంకర్ల సమావేశానికి జేసీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక బుక్‌లెట్‌ను జేసీ ఆవిష్కరించారు. తొలుత బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వార్షిక రుణ ప్రణాళికను రూ.24,003 కోట్లతో ప్రవేశపెట్టడం జరిగిందని, దీనిలో రూ.20,473 కోట్లు ప్రాధాన్యతా రంగాలకు 85.29 శాతం కేటాయించగా, వీటిలో వ్యవసాయ స్వల్పకాలిక రుణాలు, టర్మ్ లోన్స్, వ్యవసాయ యంత్ర సామగ్రి తదితర వ్యవసాయ రుణాలకు కింద మొత్తం రూ.14,153 కోట్లలో 58.96 శాతం, ఎంఎస్ఎంఈ ఎగుమతులతో కలిపి, ఇతర ప్రాధాన్యతా రంగాలకు కలిపి మొత్తం రూ.6,320 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.3,530 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. వివిధ పరిశ్రమలకు రుణాల మంజూరులో బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. అలాగే విద్యార్థులను ప్రోత్సహించేందుకు అర్హతను బట్టి విద్యాలక్ష్మి పథకం కింద రూ.7.50 లక్షల వరకు రుణాలను మంజూరు చేయాలన్నారు. చేనేత కార్మికులకు మార్జిన్ మనీ వెంటనే విడుదల చేయాలన్నారు. గత సమావేశంలో కూడా ఈ విషయమై చర్చించామని నేటి వరకు మార్జిన్ మనీ ఎందుకు విడుదల కాలేదని బ్యాంకర్లను ప్రశ్నించారు. అలాగే చేనేత కార్మికులకు లక్ష్యం మేరకు ముద్ర రుణాలను మంజూరు చేయాలన్నారు. లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, ఆర్బీఐ ఏజీఎం ఆర్‌కే హనుమ కుమారి, రీజనల్ హెడ్ యూబీఐ పి.సంగీత కుమారి, ఇండియన్ బ్యాంక్ రాజమహేంద్రవరం జోనల్ మేనేజర్ పీఎస్ఎస్ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

రేపే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్): ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఈ నెల 31వ తేదీనే పెన్షన్ల పంపిణీ చేయాలని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే అంటే ఆగస్టు 31వ తేదీన పెన్షన్ల పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఆగస్టు 31నే నూరు శాతం పింఛన్లు పంపిణీకి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని స్పష్టం చేశారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు ఎక్కడ ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించాలన్నారు. పింఛను లబ్ధిదారులు సిబ్బందికి అందుబాటులో ఉండాలని, పారపాట్లకు తావు లేకుండా పింఛన్ల పంపిణీ సజావుగా చేయాలని స్పష్టం చేశారు.



కలెక్టర్ నాగరాణి

హద్దుమీరిన టీడీపీ శ్రేణుల వికృత చేష్టలు

- కవ్వగుంటలో కొఠారుకు హారతి ఇచ్చారని దుకాణం తొలగింపు
- రోడ్డునపడి కన్నీరుమున్నీరవుతున్న రామలక్ష్మి కుటుంబ సభ్యులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గ్రామాల్లో పార్టీల పేరుతో కక్షపూరితంగా వ్యవహరించి అన్యాయంగా ఒక కుటుంబ జీవన మనుగడైన దుకాణాన్ని తొలగించి కడుపుమీద కొట్టిన హృదయవిదారక సంఘటన పెదవేగి మండలం కవ్వగుంట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గరికపాటి రామలక్ష్మి భర్త ప్రసాద్ వికలాంగుడు, వారి కుమారుడు ధనుష్ సాయి మానసిక వికలాంగుడు, వారికి ఒకపాప ఉంది. రామలక్ష్మి కుటుంబం కవ్వగుంట గ్రామంలో రావిచెట్టు సెంటర్‌లో రామాలయం ఎదురుగా గత 20 ఏళ్లుగా చిన్నపాటి దుకాణం నిర్వహించుకుంటూ దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కుమారుడికి మెదడు సంబంధిత సమస్య ఉండటంతో నెలకు రూ.5 వేల వరకు హైదరాబాద్‌లో వైద్యం చేయిస్తున్నారు. భర్త వికలాంగుడు కావడంతో ఏ ఉపాధికి వెళ్లలేక దుకాణంలో కూర్చుని ఉంటాడు. అన్నీ తానై బాధిత మహిళ రామలక్ష్మి కుటుంబాన్ని పోషిస్తోంది. 18 ఏళ్లు వచ్చినా కుమారుడికి చిన్నప్పటి నుంచి ఏ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందక వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కుమారుడికి పెన్షన్ రావడంతో వైఎస్సార్‌సీపీ అంటే రామలక్ష్మి అభిమానం. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి చెందిన అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి రామలక్ష్మికి హారతి ఇవ్వడంతో అప్పటి నుంచి పగబట్టిన టీడీపీ కార్యకర్తలు కొట్టు నరేష్, కొట్టు సత్యం, ఆటో నాగు, తెట్టిపల్లి రాంపండు, అనుమల దాసు, సుగసాని గంగయ్య, విష్ణుల ప్రొద్బలంతో టీడీపీ నాయకుల అండదండలతో తహసీల్దార్, కార్యదర్శులు పొక్లెయిన్‌తో దుకాణాన్ని గురువారం తొలగించారు. ఇంటి పక్కన ఉన్న మట్టిని తొలగించి, చెట్టును నరికివేసి, వాటర్ ట్యాప్‌ను సైతం తొలగించారని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. కుటుంబంలో భర్త, కొడుకు పరిస్థితి బాగోకపోయినా మహిళ అని కూడా చూడకుండా తన కుటుంబాన్ని రోడ్డుపాలు చేశారంటూ రామలక్ష్మి రోదిస్తోంది.



భర్త, కుమారుడితో రామలక్ష్మి కుటుంబం



బడ్డీని పొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై జబీర్

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెంలో లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన దగ్గుమళ్ల రామారావు (55) ద్విచక్రవాహనంపై గురువారం మండలం చక్రదేవరపల్లి గ్రామంలో జరిగిన ఒక ఫంక్షన్‌కి హాజరయ్యాడు. అక్కడ భోజనం చేసి తిరుగుపయనం కాగా గురవాయిగూడెం వచ్చేసరికి జంగారెడ్డిగూడెం వస్తున్న లారీ వెనుకనుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రామారావు అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని జంగారెడ్డిగూడెం ఎస్సై జబీర్ పరిశీలించారు. లారీ డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మృతుడు రామారావు తాపీ మేస్త్రీ, ఇతనికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: ఓ వివాహిత అదృశ్యంపై ఆమె భర్త చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. వివరాల ప్రకారం గణపవరం గ్రామానికి చెందిన పోలాకి మాధవి ఉండి మండలం వాండ్రం గ్రామం పరిధిలోని కింగ్‌వైట్ అనే రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తుంది. ఈ నెల 27వ తేదీ రాత్రి 9 గంటలకు గణపవరం నుంచి బయలుదేరి డ్యూటీకి వెళ్లింది. అయితే తిరిగి 28వ తేదీ ఉదయం 7 గంటలకు ఇంటికి రావలసిన తన భార్య తిరిగి రాకపోవడంతో ఆమె భర్త శివ ఉండి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విధులకు ఆటంకం కలిగించిన నేరంపై కేసు నమోదు

తణుకు: విధులకు ఆటంకం కలిగించారని ప్రభుత్వ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అయిదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తణుకు రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. తణుకు వాణిజ్యపన్నుల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహమ్మద్ అబ్దుల్ అమీద్ బుధవారం అర్ధరాత్రి తణుకు మండలం తేతలి జాతీయ రహదారిపై విధుల్లో ఉన్నారు. వాహనాలు ఆపి తనిఖీ చేస్తుండగా.. వాహనాలు ఆపడానికి మీరెవరు అని ప్రశ్నిస్తూ ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామానికి చెందిన మోపాటి సాయిసురేష్, మోపాటి శ్రీను, దుబా రామకృష్ణ దుర్గాప్రసాద్, గవర దుర్గాప్రసాద్, లంకా ఉమాదుర్గారావు అమీద్‌తో ఘర్షణకు దిగారు. దీంతో తమ విధులకు ఆటంకం కలిగించారని అమీద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై మూర్తి వివరించారు.

30 రోజుల్లో మందు మానేస్తున్నారు..

- నిషా జీవితాలను చక్కదిద్దుతున్న డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాలు
- క్రియాశీలక పాత్ర పోషిస్తున్న తాడేపల్లిగూడెం, ఏలూరులోని కేంద్రాలు
- డ్రగ్స్, గంజాయి వినియోగంపై మత్తు బానిసలకు అవగాహన





మద్యం బానిలసకు సైకాలజీ తరగతులు



తాడేపల్లిగూడెంలోని దీక్ష మత్తు పదార్థాల బానిసల పునరావాస కేంద్రం

తాడేపల్లిగూడెం: నేటి సమాజంలో మద్యం ఒక ఫ్యాషన్‌గా మారింది. సంతోషం వచ్చినా.. విషాదం ఆవహించినా మత్తులో జోగడమే పరిపాటి అయ్యింది. ఒక సంస్థ చేసిన సర్వేలో గతంలో మద్యం తాగే తొలి అనుభవం 25 సంవత్సరాల వయస్సులో కలిగితే.. ప్రస్తుతం 13వ ఏట నుంచే మద్యం రుచి చూస్తున్నారని సంస్థ సర్వే సారాంశం. మాధ్యమాల ప్రభావమో.. పాశ్చాత్య సంస్కృతి ప్రభావమో కానీ.. సరదాగా ప్రారంభమైన మద్యం అలవాటు అనంతరం వ్యసనంగా మారి అనర్థాలకు దారి తీస్తోంది. ఎన్నో జీవితాలను నాశనం చేస్తోంది. మద్యం మత్తులో అత్యాచారాలు, హత్యలు, అసాంఘిక కార్యకలాపాలు పెచ్చరిల్లిపోతున్నాయి. సామాజిక జాఢ్యంగా మద్యం మహమ్మారి జడలు విప్పడంతో పూర్తిగా మద్యానికి బానిసైన వారిని ఆ మత్తులో నుంచి బయటకు తీసుకొచ్చేందుకు, వారి జీవితాలను చక్కదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాలు నిర్వహిస్తున్నాయి.

మత్తు రహిత భారతం కోసం..

కేంద్రంలోని సోషల్ జస్టిస్ ఫర్ ఎంపవర్‌మెంట్ శాఖ ద్వారా నషా ముక్త్ భారత్ (మత్తు రహిత భారత దేశం) కోసం ప్రయత్నాలు గత పదేళ్లుగా చేస్తున్నాయి. మత్తులో తూగే జిల్లాలు దేశ వ్యాప్తంగా 372 ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలు ఉన్నాయి. నషా ముక్త్ భారత్ కోసం జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాల నిర్వాహకులు భాగస్వాములుగా జిల్లాల్లో కమిటీలు పనిచేస్తున్నాయి.

క్రియాశీలకంగా డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాలు

మద్యానికి బానిసైన వారిని 30 రోజుల వ్యవధిలో మందు మాన్పించడానికి, మార్పు తీసుకురావడం కోసం డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరికి కేంద్ర స్థానంలో ఉన్న తాడేపల్లిగూడెంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రిత్వ శాఖ సహకారంతో దీక్ష డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్‌ను దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహిస్తోంది. జిల్లా రెండుగా విడిపోవడంతో, తాడేపల్లిగూడెం కేంద్ర సేవలను గుర్తించిన కేంద్రం ఏలూరులో కూడా ఈ కేంద్ర నిర్వహణ బాధ్యతలను గూడెం కేంద్రానికే అప్పగించారు. తాడేపల్లిగూడెం, ఏలూరులో కలిపి ఇప్పటి వరకు 2000 మందికి కౌన్సెలింగ్ ఇస్తే సుమారు 1700 మంది మందు మానేశారు.

ఈ కేంద్రాల్లో ఏం చేస్తారంటే..

మద్యానికి బానిసైన వారి నుంచి తాగుడుకు ఎలా బానిసయ్యారో.. ఏ పరిస్థితులు దీనికి సహకరించాయో వివరాలడిగి తెలుసుకుంటారు. దానికనుగుణంగా గ్రూపు థెరపీ, వ్యక్తిగతంగా, వైద్యుల ద్వారా కౌన్సెలింగ్ పద్ధతుల్లో 30 రోజుల పాటు కేంద్రంలో ఉంచి మందు తాగే అలవాటును మాన్పిస్తారు. తాడేపల్లిగూడెం, ఏలూరులలో కలిసి 30 బెడ్ల సామర్థ్యం ఉంది. నెల రోజుల పాటు కౌన్సెలింగ్, వైద్యం, భోజనం, వసతి అంతా కూడా ఉచితంగానే కల్పిస్తారు. డీ అడిక్షన్ కేంద్రాల్లో ఇద్దరు కౌన్సిలర్లతో పాటు ఒక వైద్యుడు, నర్సు, సిబ్బంది సేవలు అందిస్తారు. సైకాలజీ తరగతులు, లాఫింగ్ యోగా, యోగా వంటివి కూడా నేర్పుతున్నారు.

మంచి ఫలితాలు వస్తున్నాయి



మా కేంద్రం తాడేపల్లిగూడెంలో ప్రారంభించి పదేళ్లు కావస్తోంది. జిల్లా విభజన తర్వాత ఏలూరులో కూడా ప్రారంభించాం. ఇప్పటి వరకు సుమారు 1700 మంది మద్యం అలవాటును మానేశారు. మొదట కేంద్రంలో చేరినవారు మూడు నాలుగు రోజులు అదో రకంగా ఉంటారు. నెమ్మదిగా అనుభవాలు పంచుకుంటారు. తాగుడుకు బానిస అవ్వడం వల్ల శరీరంలో అవయవాలపై ఎలా ప్రభావం చూపుతుంది.. సమాజంలో ఎలా పలుచన అవుతారో వారికి వివరిస్తాం. తాగుడు మానితే భవిష్యత్ ఎలా బాగుపడుతుందో కౌన్సెలింగ్, గ్రూపు థెరపీల ద్వారా అర్థమయ్యేలా చెబుతాం. దీంతో వారిలో చాలా వరకు మార్పు వస్తుంది. ఈ కేంద్రంలో చేరాలనుకొనేవారు 08818–223969 నంబరులో సంప్రదించవచ్చు.

– మల్లిపూడి కనకదుర్గాదేవి, కేంద్ర నిర్వాహకురాలు, తాడేపల్లిగూడెం

రెండు ఇసుక టిప్పర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న టిప్పర్ లారీలు

చింతలపూడి: చింతలపూడి మండలం అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద రెండు ఇసుక టిప్పర్లను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఈ టిప్పర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఇసుక కుక్కునూరు రీచ్ నుంచి యర్రగుంటపల్లి తరలిస్తున్నట్లు పత్రాలు ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి ఇసుక టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

భీమవరం: భీమవరం పట్టణంలోని టౌన్ రైల్వే స్టేషన్లో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. వీరవాసరం మండలం కొణితివాడ గ్రామానికి చెందిన దుంటి చంటిబాబు బుధవారం రాత్రి గుంటూరు నుంచి నర్సాపురం వెళ్లే ప్యాసింజర్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు భీమవరం రైల్వే ఎస్సై పీటీవీ రమణ తెలిపారు. చంటిబాబు మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమణ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి

గణపవరం: గణపవరంలో కారు ఢీకొని ఓ వృద్ధుడు మరణించాడు. వివరాల ప్రకారం బుధవారం రాత్రి వీరాస్వామి రోడ్డుపై వెళ్తుండగా ఏపీ 30 జె 9000 నెంబరు గల కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరాస్వామి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. వీరాస్వామి కుమారుడు సుందర్రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

నిట్‌లో క్రీడా దినోత్సవం



నిట్‌లో క్రీడాదినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. గురువారం నిట్‌లో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహిస్తున్నాయని, విద్యార్థులు ఈ అవకాశాలను అందిపుచ్చుకొని క్రీడాకారులుగా ఎదగాలన్నారు. అసోసియేట్ డీన్ కిరణ్ తీపర్తి మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల్లో దేశం తరఫున పాల్గొని వరుసగా మూడుసార్లు బంగారు పతకాలను దేశానికి అందించిన హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడాదినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. దేశభక్తిని, క్రీడా స్ఫూర్తిని చాటిచెప్పి ధ్యాన్‌చంద్ భావితరాలకు స్ఫూర్తిప్రదాతగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా సిబ్బంది, విద్యార్థులు నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆచార్యులు వి.సందీప్, డాక్టర్ రాముడు, సాస్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లస్కర్ల జీతాలు వెంటనే చెల్లించాలి

ఏలూరు(మెట్రో): డెల్టాలో పనిచేస్తున్న సుమారు 250 మంది లస్కర్లకు వెంటనే జీతాల బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బోడగిరి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. 10 నెలలుగా వారికి జీతాలు అందడం లేదని తెలిపారు. వారికి ఆప్కోస్ ద్వారా జీతాలు పెంచి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వహణకు సరిపడినంతమంది సిబ్బంది ఏర్పాటుకు ప్రభుత్వం కృషిచేయాలని ఆయన కోరారు. పోలవరం ఎడమ కాల్వ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు.

అనుమానంతో భార్యపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న నిర్మల

పెదవేగి: గత కొంతకాలంగా కుటుంబ కలహాలు, దీనికి తోడు భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి భార్యపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం ముండూరు గ్రామానికి చెందిన అనపా అచ్చియ్య, నిర్మల భార్య భర్తలు. వీరికి ఇద్దరు సంతానం. అచ్చియ్య కూలి పనులకు వెళ్తుంటాడు. గత కొంతకాలంగా భార్య, భర్తల మధ్య వివాదం నెలకొండడంతోపాటు నిర్మలపై అచ్చియ్య అనుమానం పెంచుకున్నాడు. ఈ నెల 27న భార్యభర్తలు ఇద్దరు గొడవపడ్డారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 12.30గంటల ప్రాంతంలో నిర్మలపై అచ్చియ్య కత్తితో దాడి చేయడంతో ఆమె రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమె పెద్దగా కేకలు వేస్తూ ఇంటి నుంచి బయటకు పరిగెట్టడంతో స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఏలూరులోని ప్రభుత్వాసుపత్రికి ఆమెను తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు.

చోరీ ఘటన విషాదాంతం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో నెలరోజుల క్రితం సంచలనం సృష్టించిన చోరీ ఘటన గురువారం విషాదం మిగిల్చింది. వివరాల ప్రకారం.. జూలై 29వ తేదీ మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో వృద్ధురాలు కలిశెట్టి అనసూయ (74) ఇంటిలోకి ఇద్దరు వ్యక్తులు చొరబడ్డారు. వృద్ధురాలిపై రాయితో దాడి చేయడంతో పాటు నగలు దొంగిలించడమే కాకుండా అతి కిరాతకంగా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు అనసూయను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు. అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గత నెల రోజులుగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు ఆమె బంధువులు తెలిపారు. రాజమండ్రిలో ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అక్కడే అంత్యక్రియలు చేసినట్లు తెలిపారు. సీఐ కె.రజనీకుమార్ కేసును విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కొండేపాడు సచివాలయంలో చోరీ

పెంటపాడు: పెంటపాడు మండలంలోని బి.కొండేపాడు గ్రామ సచివాలయంలో చోరీ జరిగింది. బుధవారం సాయంత్రం గ్రామ కార్యదర్శి శ్రీరంగ సచివాలయానికి తాళాలు వేసి వెళ్లిపోయారు. గురువారం ఉదయం వచ్చేసరికి సచివాలయ తలుపు గొళ్లెం పెకలించి ఉండడం, బీరువాలోని ఫైళ్లు చిందరవందర చేసి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొంత నగదు మాయమైనట్లు సమాచారం. కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

ఏలూరు (టూటౌన్): చెక్‌బౌన్స్ కేసులో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కమర్షియల్ టాక్స్ కార్యాలయ ఉద్యోగికి ఏడాది జైలు శిక్ష పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో క్లర్కుగా పనిచేస్తున్న కాజా కిరణ్ ఏలూరుకు చెందిన గెడ్డం శ్రీ వంశీ దగ్గర కొద్ది రోజుల కిందట కొంత సొమ్ము అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించే నిమిత్తం చెక్కు ఇచ్చారు. దాన్ని బ్యాంకులో వేస్తే చెల్లకపోవడంతో వంశీ కోర్టును ఆశ్రయించాడు. విచారణ అనంతరం ఏలూరు మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి గురువారం తీర్పు వెలువరించారు. చెల్లని చెక్కు ఇచ్చిన కాజా కిరణ్‌కు ఏడాది జైలు, రూ.2 లక్షల జరిమానా విధించారు.

పనిచేస్తూ.. కుప్పకూలి తాపీమేస్త్రి మృతి

ద్వారకాతిరుమల: కూలిపని చేస్తూ ఒక తాపీ మేస్త్రి గుండెపోటుకు గురై మృతి చెందాడు. వివరాల ప్రకారం. భీమడోలు మండలం పాలసానిపల్లికి చెందిన తాపీ మేస్త్రి మడికే విశ్వేశ్వర గురువారం ఉదయం ద్వారకాతిరుమలలో కూలి పనులకు వెళ్లాడు. ఒక ఇంటి వద్ద మట్టి పనులు చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై, కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు వెంటనే ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తరలించగా, పరీక్షించిన వైద్య సిబ్బంది అప్పటికే అతడు మృతి చెందినట్టు నిర్ధారించారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

వృద్ధురాలి మృతి, మరొకరి పరిస్థితి ఆందోళనకరం



కైకలూరు మండలం సింగాపురం వద్ద ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



మృతి చెందిన దుర్గాదేవి



చికిత్స పొందుతున్న విశ్వనాథరాజు



క్షతగాత్రుడు అప్పలరాజు

కైకలూరు: వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఓ ఆటోను ఢీకొట్టడంతో ఆటోలోని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన కైకలూరు మండలం సింగాపురం జాతీయ రహదారిపై గురువారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన దాట్ల అప్పలరాజు (64), వీరి అన్నయ్య విశ్వనాథరాజు (70), వదిన దుర్గాదేవీ (68) కలసి ఆటోలో కైకలూరులో టైల్స్ కొనుగోలు చేయడానికి వచ్చారు. తిరిగి ప్రయాణంలో సింగాపురం వద్దకు రాగానే భీమవరం – ఏలూరు పాసింజరు ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీ కొట్టింది. కొంతదూరం ఈడ్చుకు వెళ్లడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కైకలూరు ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దుర్గాదేవి మరణించింది. ఆమె భర్త విశ్వనాథరాజు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు చెప్పారు. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడు అప్పలరాజు ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు పీడీఎస్‌యూ జిల్లా కౌన్సిల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని

తణుకు: తణుకులో శుక్రవారం నిర్వహించనున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఉమ్మడి జిల్లా సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కాకి నాని, ఎన్.మహర్షి కోరారు. గురువారం తణుకులోని పలు కళాశాలల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. తణుకులో చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బి.వినోద్, విద్యార్థి సంఘం నాయకులు వై.రాజేష్, కె.చంటి పాల్గొన్నారు.

కృష్ణాయపాలెం ఫీవర్ సర్వే


కృష్ణాయపాలెం గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో గురువారం ఫీవర్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి రక్త నమూనాలు సేకరించారు. జ్వర అనుమానితులకు మందులు అందజేశారు. మాధవరం పీహెచ్‌సీ పరిధి గ్రామాల్లో ఈ సర్వే నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఏవీ.వెంకటేష్, టి.సింధు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో జి.వెంకటేశ్వరరావు, ఏఎస్ఎం, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలపై మక్కువ పెంచుకోవాలి


గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని నన్నయ్య క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.అశోక్ కోరారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో హాకీకి ధ్యాన్‌చంద్, బాషాభివృద్ధికి గిడుగు చేసిన సేవలను తెలిపారు. తెలుగుభాష కమ్మదన్నాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని, తెలుగును ప్రేమిస్తే మన అమ్మను గౌరవించినట్లన్నారు. ఎన్ని భాషలు నేర్చిన మాతృభాషను మార్చిపోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న సర్పంచ్ అడ్డా బాబు

తణుకు టౌన్: బాల్య వివాహాలు జరకుండా అప్రమత్తంగా ఉండాలని దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా వెంకట సూర్యనారాయణమూర్తి (అడ్డా బాబు) తెలిపారు. గురువారం తణుకు మండలం దువ్వ గ్రామంలో జరిగిన బాల్య వివాహాల నిషేధ చట్టం 2006పై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటలక్ష్మీ మాట్లాడుతూ బాల్య వివాహాలు, మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడుల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామంలోని సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం అందజేత


వృద్ధులకు బియ్యం అందజేస్తున్న ఆర్డీఓ, సమితి సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో వల్లి, మోహన్ సేవా సమితి సేవలు అభినందనీయమని ఆర్డీఓ, స్పెషల్ ఆఫీసర్ బి.శివన్నారయణ రెడ్డి అన్నారు. పాతూరు మసీద్ సెంటర్‌లో గురువారం సేవా సమితి అధ్యక్షుడు పఠాన్ వల్లి, కార్యదర్శి గొల్లేరు మోహన్ నలుగురు నిరుపేద వృద్ధులకు ఒక్కొక్కరికి 20 కేజీల బియ్యం, ఆయిల్ పేకెట్లు, నిత్యావసర సరుకులు, కూరగాయాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు అడపా తిలక్, ఉండ్రాజవరపు భాస్కరరావు, గాంధీ మండపం నిర్వాహకులు దుర్గా రామచంద్రరావు, దినేష్, సతీష్, మధు, దుర్గా ప్రసాద్, హరిష్, భాష, సత్యనారాయణ, రంగారావు, పాల్గొన్నారు.



పటిష్ట చర్యలతోనే భద్రత



కోల్‌కతా ఘటన పునరావృతం కాకుండా దేశ వ్యాప్తంగా ఆస్పత్రుల వద్ద ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టాలి. ఒక వైపు కుటుంబాన్ని, మరోవైపు సుఖ సంతోషాలను సైతం త్యాగం చేసి వైద్యులు సేవలందిస్తుంటారు. రాత్రనక, పగలనక నిత్యం వైద్య సేవలు అందిస్తున్న వైద్యులపై దాడులకు పాల్పడడం దారుణం. కేవలం వైద్య రంగంలోనే కాకుండా మహిళలు పనిచేసే అని విభాగాల వద్ద ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టాలి.

– ఎండీఎం ఖాన్, తాడేపల్లిగూడెం

వైద్యులకు భరోసా కల్పించాలి



ప్రజా సేవ చేసే వైద్యులకు భరోసా కల్పించాలి. పని ప్రదేశంలో తగిన రక్షణ చర్యలు ఉండాలి. కోల్‌కతా ఘటన పునరావృతం కాకుండా పటిష్టమై, కఠిన చట్టాలు అమలు చేయాలి. వైద్యులు, నర్సులు ఎంతో సేవాభావంతో పనిచేస్తారు. వారికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి. ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలి.

– పీ రాధా జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, పైడిపర్రు

చిట్టడవుల్లా రహదారులు

- రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలే
- దోమలు, విష సర్పాలకు ఆవాసాలుగా మారిన వైనం
- రోడ్డుపైకి రావాలంటే భయపడుతున్న ప్రజానీకం


తణుకు పాత ఆర్టీవో కార్యాలయం మునిసిపల్ పార్కు సమీపంలోని బ్రాహ్మల వీధిలో రోడ్డుకి ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

తణుకు అర్బన్ : దోమ కుడితే ప్రమాదమంటూ దోమల నిర్మూలనకు పాటుపడాలని వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ఇంటింటికి వెళ్లి పోరుపెడుతున్నారు. జ్వరాలొస్తున్నాయి, డయేరియా పొంచి ఉంది జాగ్రత్త అంటూ మునిసిపల్ అధికారులు మైకుల్లో ఊదరగొడుతున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా తణుకు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ మాత్రం రోజురోజుకి దిగజారిపోతున్న వైనాన్ని ఇటు అధికార యంత్రాంగం, అటు పాలకులు కూడా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని తణుకువాసులు గగ్గోలు పెడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఉన్న వాస్తవ పరిస్థితులు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నా నిమ్మకునీరెత్తినట్లు చోద్యం చూస్తున్న తీరు ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ హయాంలో ఎంతో బాధ్యతాయుతంగా యంత్రాంగం పనిచేసిందని కానీ నేడు పట్టించుకునే నాధుడే లేడంటూ ప్రజలు నోరెళ్లపెడుతున్నారు.

దట్టంగా గడ్డి, పిచ్చిమొక్కలు...

పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకంగాను, దోమలకు నిలయంగాను తణుకులో రహదారులు దర్శనమిస్తున్నాయి. ఏ రోడ్డులో చూసినా ఇరువైపులా దట్టంగా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.

విషసర్పాలకు ఆవాసాలు

రోడ్డు మార్జిన్‌లలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, గడ్డిలో విషసర్పాలు పొంచి ఉన్నాయని అవి పగటిపూటే రోడ్డుకి ఇరువైపులా ప్రయాణాలు చేస్తుండడాన్ని చూస్తున్నామని బ్యాంక్ కాలనీవాసులు చెబుతున్నారు. పిల్లల్ని ఒంటరిగా పాఠశాలలకు పంపించాలంటే భయాందోళన చెందుతున్నామని వాపోతున్నారు. ఈ సమస్య అధికంగా బ్యాంక్ కాలనీలో ఉండగా, సజ్జాపురం, హౌసింగ్ బోర్డు, ఇరగవరం, ఎన్జీవోస్ కాలనీలతోపాటు పాతవూరు తదితర ప్రాంతాల్లో రహదారులు చిట్టడవుల్లా మారిపోయాయని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. మునిసిపల్ అధికారులు దృష్టి సారించి రహదారుల మార్జిన్‌లలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగింపజేయాలని కోరుతున్నారు.

కొన్ని ప్రాంతాల్లో రహదారులపైకి వస్తున్న పిచ్చిమొక్కలు ప్రయాణాలకు కూడా ఆటంకంగా మారాయి. ముఖ్యంగా పగలంతా పిచ్చిమొక్కల్లో నివాసాలు ఉండి రాత్రిపూట ఇళ్లలోకి వచ్చి దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, దోమ కుడితే జ్వరాలే అంటూ చేస్తున్న ప్రచారానికి భయపడుతున్నామని నివాసితులు గగ్గోలు పెడుతున్నారు.


తణుకు బ్యాంక్ కాలనీలో రహదారిని కమ్మేసిన పిచ్చిమొక్కలు


తణుకు ఎన్జీవో కాలనీలో రోడ్డు మార్జిన్‌లో ఏపుగా పెరిగిన గడ్డి


తణుకు పిల్లకాలువ గట్టు ప్రాంతంలో పెరిగిన పిచ్చి మొక్కలు

పెంటపాడు ఎస్‌ఐగా స్వామి



పెంటపాడు:పెంటపాడు నూతన ఎస్‌ఐగా కేసీహెచ్ స్వామి భాద్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ శంకర్ భీమవరం ఎస్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో స్థానంలో ఏలూరు జిల్లా చాట్రాయి మండలంలో పనిచేస్తున్న ఎ స్వామి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గురువారం పెంటపాడులో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది కలిసి ప్రత్యేకంగా అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ పరిధిలో ప్రయాణీకులు, కార్గో వినియోగదారులు తమ విలువైన సూచనలు, సలహాలు, ఫిర్యాదులు తెలిపేందుకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం ఈ నెల 30వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ యేలూరి సత్యనాయణ మూర్తి తెలిపారు. తీర్థ యాత్రలు, కార్గో సేవలు, కొరియర్ సేవలు, రెగ్యూ లర్ బస్సు సర్వీస్‌లకు సంబంధించి సూచనలు, సలహాలు, ఫిర్యాదులు ఇవ్వాలని, ఫోన్ నెంబర్ 99592 25488 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పెంటపాడు: విద్యార్థుల సంక్షేమ హస్టల్స్‌పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సహాయ సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయరాజు పేర్కొన్నారు. గురువారం ఆయన సబ్‌డివిజన్ విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ సభ్యులు రొక్కాల నాగబుజ్జి ఆధ్వర్యంలో హస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హస్టల్ వెల్ఫేర్ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయం


విజేతలకు బహుమతులు అందిస్తున్న సీఐ కొండయ్య తదితరులు

తణుకు అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడాకారులకు పరుగు పందెం పోటీలు నిర్వహించడం అభినందనీయమని తణుకు పట్టణ సీఐ ఎన్. కొండయ్య అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహించిన పరుగు పందెం పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపట్ల ఆసక్తి చూపించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా అధ్యక్షుడు బి.జాన్సన్ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. వివిధ విభాగాల్లో బాలురు, పురుషులు, బాలికలు, స్త్రీలు కేటగిరీలుగా నిర్వహించగా 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారని వారిలో 40 మంది విజేతలైనట్లు అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. విజేతలకు పట్టణానికి చెందిన బి.నరసింహమూర్తి, మద్దాల శ్రీనివాస్‌లు సౌజన్యంతో సమకూర్చిన బహుమతులు, ధ్రువపత్రాలను ఎస్సై జీఎస్ మూర్తి అందజేశారు. అనంతరం పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న దండి జ్యోతికశ్రీకి శిక్షణిచ్చిన కోచ్ కె.సీతారామయ్యను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ చైర్మన్ మానేపల్లి శ్రీనివాస్ బాలికల పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి కె.బాబూరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.సత్యనారాయణ, కె.సుబ్బారావు, ఎ.నాగేశ్వరరావు, కె.వెంకన్నబాబు, టి.వినోద, కె.సంధ్య, పి.జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి


తణుకులో ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న నరసింహారావు, ఏఓఐ నాయకులు

తణుకు అర్బన్: బంగారు బాతులాంటి ఎల్‌ఐసీ సంస్థను నిర్వీర్యం చేసే ఉద్దేశ్యంతో ప్రైవేటుకు దారాదత్తం చేసేందుకు ప్రభుత్వం పావులు కదుపుతుందని ఎల్‌ఐసీ ఏఓఐ జోనల్ జనరల్ సెక్రటరీ పీఎల్ నరసింహారావు అన్నారు. ఎల్ఐసీ ఏఓఐ ఆధ్వర్యంలో గురువారం తణుకు బ్రాంచ్ కార్యాలయం ముందు గేట్ మీటింగు ఏర్పాటు చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఐసీ ఏఓఐ ఆల్ ఇండియా పిలుపుమేరకు యావత్ భారతదేశంలో ఈరోజు గేట్ మీటింగులు నిర్వహించినట్టు చెప్పారు. డిజిటలైజేషన్ విధానం పేరుతో చిన్నస్థాయి ఏజెంట్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేసే దుష్టప్రక్రియ ప్రారంభించిందని, ఇందులో భాగంగా పేపర్‌లెస్ విధానంతో ఏజెంట్స్ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. జీవిత బీమా రంగాన్ని జీఎస్టీ నుంచి, ఎల్‌ఐసీ ప్రీమియంను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని, పాలసీ ప్రీమియం 5 లక్షలు దాటి ఉన్న పాలసీలపై వచ్చే ఆదాయానికి పన్ను విధించబడుతుందనే షరతును ఉపసంహరించుకోవాలని, బీమా రంగంలో ఎఫ్డీఐని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఎల్‌ఐసీని కాపాడుకునేందుకు భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సత్తి పాండురంగారెడ్డి, అధ్యక్షుడు సలాది ఉదయ భాస్కరరావు, కార్యదర్శి మడిచర్ల రవిరామకృష్ణ, కోశాధికారి నార్కెడమిల్లి ప్రసాద్, ఏజెంట్స్ బొలిశెట్టి రామనాథ్, సీహెచ్ వెంకటేశ్వరరావు, గంటి శ్రీనివాస్, రాజా, కర్రి వీర్రెడ్డి, వనం నరసింహులు, ఉబా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని, కాలానుగుణవ్యాధులను అరికట్టడంలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. హెల్త్ అధికారులు, సిబ్బందిచే పట్టణంలోని తొమ్మిదోవ వార్డులో 8, 9, 10, 16 క్లస్టర్‌లలో ఫీవర్ సర్వేలు జరిగాయి. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం ఆరోగ్య సర్వేలు, హెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు, కీటక నియంత్రణలు, ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా, నివారించేందుకు ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీవీ లక్ష్మి, ఆశా సుజాత, సహాయకులు కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఆరుగొలను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డీసీవో భారతి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం జిల్లా కోఆర్డినేటర్ ఎస్.భారతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కిచెన్, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆహారం వేడిగా ఉండగానే భుజించాలన్నారు. పాఠశాల విశ్రాంతి గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లేకుంటే దోమలు వృద్ధి చెంది వ్యాధి కారకాలుగా మారతాయన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బీహెచ్. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ ఎస్.సుజన్‌రాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకుందాం



అత్తిలి: బల్లిపాడులో మాట్లాడుతున్న హెచ్ఎం బాలసుబ్రహ్మణ్యం

అత్తిలి: మాతృభాషతోనే మానవ జాతి మనుగడ సాధ్యమవుతుందని అత్తిలి బాలుర యూపీ స్కూల్ తెలుగు ఉపాధ్యాయిని ఎస్ లక్ష్మీసూర్యకాంతం అన్నారు. గురువారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూర్యకాంతం మాట్లాడుతూ కనుమరుగు అవుతున్న తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగువారిపై ఉందన్నారు. ఈ సందర్భంగా తెలుగు భాషలో ఉన్న ప్రక్రియలు, శతకాలు, అష్టావధానం తదితర విషయాలను విద్యార్థులకు పరిచయం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మాతృభాషపై అందరూ అభిమానం పెంచుకుని, తెలుగు భాషను చదవాలని, మన సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన కార్యక్రమం సభికులను ఆకట్టుకుంది. తెలుగుతల్లి వేషధారణలో జాహ్నవి ఆకట్టుకుంది. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు పి రాంబాబు, టి ఆత్మలింగం, ఉపాధ్యాయుల కార్యదర్శి శ్రీనివాసరావు, ఎస్ పురుషోత్తం, సుజాతాదేవి, ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఆరవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు నారాయణరాజు, ఎం బాలాజీ, ఈ సత్యవతి పాల్గొన్నారు.

వ్యవహారిక భాషకు ఆద్యుడు 'గిడుగు'

తాడేపల్లిగూడెం రూరల్: వ్యవహారిక భాషకు ఆద్యుడు గిడుగు రామ్మూర్తి అని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ ఎస్. భారతి అన్నారు. గురువారం మండలంలోని పెద తాడేపల్లి, ఆరుగొలను ఎస్సీ హాస్టల్స్, పెదతాడేపల్లి బీసీ బాలుర హాస్టల్‌లో గిడుగు రామ్మూర్తి, హాకీ ప్లేయర్ ధ్యాన్ చంద్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ తెలుగు వాడుక భాషలో రాయడం, మాట్లాడటం వంటి వాటి కోసం పోరాడిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అన్నారు. భారతదేశానికి ఒలంపిక్స్‌లో హాకీ విభాగం నుంచి మూడు బంగారు పతకాలు తెచ్చిపెట్టిన వ్యక్తి ధ్యాన్ చంద్ అని కొనియాడారు. ఆయనను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుగొలను ప్రిన్సిపల్స్ బి.రాజారావు, బీహెచ్. శ్రీనివాస్, బీసీ హాస్టల్ అధికారిణి జి.కళ్యాణి, వైస్ ప్రిన్సిపల్ ఎస్. సుజనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను గురుకుల పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ జయంతి వేడుకలు

తెలుగు భాషను కాపాడుకోవాలి

తణుకు టౌన్: తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. గురువారం రామకృష్ణ సేవా సమితి భవన్‌లో సినీ గేయ రచయిత రసరాజు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగు భాషకు విశేషంగా కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ప్రతి ఏటా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా తెలుగు భాషకు సంబంధించిన నన్నయ్య పీఠం కార్యదర్శి సుశర్మ, పుస్తక రచయిత కానూరి బదరీనాథ్, సీనియర్ పాత్రికేయులు బెల్లంకొండ బుచ్చిబాబు, షణ్ముఖి విజయకుమార్‌లను సత్కరించారు. ఈకార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు, భాషాభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ..

తణుకులోని ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి వెంకట రమణ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాస్ ప్రసాద్‌లు మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాష ఉద్యమం ద్వారా భాషాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, పీడీ వెంకన్న బాబు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


తణుకు టౌన్ : మహిళా కళాశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మహిళా కళాశాలలో ..

తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో జరిగిన తెలుగు భాషాదినోత్సవ వేడుకలలో ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి అధ్యక్షత వహించారు. విద్యార్థినీలకు తెలుగు భాషా వైభవం అనే అంశంపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

పెంటపాడు: మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో కవిత పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు, అధ్యాపకులు సుంకర్ గోపాల్, రామచంద్ర పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం


శశిలో 2కె రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం శశి ఇంజనీరింగ్ కళాశాలలో 2కె రన్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందన్నారు. భారతదేశ క్రీడాకారులకు పరిచయం లేని హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ అన్నారు. వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ భారత హాకీ ఇంద్రజాల నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత ధ్యాన్‌చంద్‌దే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ , పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, శేఖర్, అన్నవరం, కేకే తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు: తణుకు డీ1, డీ2, వేల్పూరు, అత్తిలి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. తణుకులోని వేల్పూరు రోడ్డు, బ్యాంకు కాలనీ, సూర్యాలయం వీధి, బెల్లం మార్కెట్, ఎస్ఎన్‌వీటీ కళాశాల, సంతమార్కెట్ ప్రాంతాలతోపాటు ఎన్టీఆర్ పార్కు, తణుకు మండలంలోని వేల్పూరు స్టేషన్‌రోడ్డు, విష్ణుప్రియనగర్, వీరభద్రపురం, అత్తిలి, పాలి గ్రామాల్లో సరఫరా నిలిచిపోతుందన్నారు.

నేడు వన్ టౌన్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు, కడకట్ల, పాతూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం వన్ టౌన్‌లోని అన్ని ఏరియాల్లో ఈ నెల 30వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. టూ టౌన్‌లోని యాగర్లపల్లి, రామచంద్రరావుపేట, భాగ్యలక్ష్మీపేట, కొబ్బరితోట పరిసర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వచ్ఛంద సేవలు మరింత ముందుకు


రొక్కాల నాగబుజ్జిని సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవలను మరింత ముందుకు తీసుకువెళ్లతామని సంస్థ ప్రెసిడెంట్ రొక్కాల నాగబుజ్జి వెల్లడించారు. జిల్లా ఉత్తమ సోషల్ వర్కర్ అవార్డు అందుకున్న రొక్కాలకు అభినందనలు చెబుతూ నాగబుజ్జి దంపతులను గురువారం ఆదర్శ సేవా సంస్థ సభ్యులు ఘనంగా సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశీర్వాదం, కోశాధికారి గంజి సుగుణ, రాజేష్, రవి కుమార్, జాన్‌బాబు, నరేష్, అభిషేక్, నవ్యప్రియ, రమేష్, వెంకటేష్, పాల్, సాలెం రాజ్‌లు పాల్గొన్నారు.